# 'స్వర్గాదపి-'

★

శ్రీ జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి

వారంరోజులు అమృతమథనం అంతపని జరిగింది. నరంనరం, కీలుకీలూ, రక్త కణంకణం ప్రాణాలు తోడింది. తల సరేసరి. ఎట్టకేలకు— కాంతయ్య తల—చిట్లింది! విషం ముందుపుట్టి, అమృతం ఆపైని ఆవిర్భవించినట్లు — దుర్భరమైన యాతనఐనాక, సహస్రారంనుంచి హంస లేచింది. కాంతయ్యకు ముక్తి కలిగింది.

రోదసి అంతా నిండిన తైజసపరమాణువులలో కాంతయ్య ఒకడు: ఏజంఝూ ప్రభంజనానికీ ఆరిపోని, నివాతనిష్కంప ప్రదీపమువలె కాంతయ్య ఆత్మ మాపు లేని మాపులతో తన శరీరాన్నే చూచింది!

తనకోసం ఏడుస్తున్న దారాపుత్రాదులు "లాంఛనాన్ని" నిర్వర్తిస్తూంటే—కాంతయ్య నవ్వు ఆపుకొన్నాడు! మనవాడు పాత అంపేతను విడిచి సుఖపడబోతున్నాడు అని సంతోషించరేం? అని అనుకున్నాడు కాంతయ్య.

చైతన్యం, కదిలింది.

మబ్బులు, చల్లదనం పులకించేటి మబ్బులు, తన భ్రుకుటిదగ్గర మెరిసిన ఇంద్రధనుస్సును పుణికి పుచ్చుకున్నట్లున్న ఇంద్రధనుస్సు, తేజోమేఘాలు, తేజోమండలాలు, పాలవెల్లి, ఒకటేమిటి — తారలు గ్రహాలు ఒకటొకటే వస్తున్నై. జారుకుంటున్నై.

"ఓహో! ఏం ఇదిగా వుందీ — అనుకుంది కాంతయ్య.

"మరేమిటనుకున్నావ్ —"

"ఎవరు నాయనా నువ్వు" లీలగా కనిపిస్తున్నావ్. అంతకంటె తెలుస్తున్నావు!

"నీవంటివాణ్ణి."

"పాపం, కాంతం ఒంటరివాడౌతున్నాడని, దయతో తోడువస్తున్నావన్నమాట. కృతజ్ఞుణ్ణి."

"యింకా పాతవాసనలు పోలేదు కాబోలు!"

కాంతయ్య ఏదో చెప్పబోయి ఊరుకున్నాడు!

"ఏం అల్లా వున్నారు..."

"నీ అధీనుణ్ణి—"

ఆ గంతుకుడు మందహాసం చేశాడు. కాంతయ్య డిల్లపోయాడు. బెజవాడలో, నడివేసంకాలం అర్ధరాత్రి — మేడమీద నుంచుని సుబ్బులు నవ్వింది అలాగు. అంత పొందికైన నవ్వు మళ్ళీ!!

"రండి. స్వర్గానికి పోతున్నాం—"

"నాలాంటి క్షుద్రులకు గూడానా బాబూ, స్వర్గం ...? ఎంత పుణ్యమో చేసుకొన్నవారికి గాని—"

ఆగంతుకుడు మాట్లాడలేదు.

"నాయనా! ఒక్కమాట చెప్పు ... చిన్నప్పటి నుంచీ వినివిని ఉన్న స్వర్గానికి పోతున్నానా ..., నిజం...??"

"ఆ"

"బాబూ. క్షమించు. అడగాలని అనుకునీ ఆగిపోతున్నాను. నీ పేరు?"

"ఒక ప్రాణిని ఎలా పిలిచినా పలుకుతాను"

"అవునవును. సముద్రాన్ని చేరాక, నదులకు వేరే పేరేముంటుందిలే—"

"వచ్చేశాము"

"వచ్చేశాం. ఎంతకాలానికి! జారూ బురదా లేనిది; ఎండా వానా లేనిది; ఆకలీ దప్పీకాలేనిది—"

"భయంలేనిది! భూమ్మీద భయమే. మరేమీ వుండదు. ఇక్కడ ఆ భయం అంటూ వుండనేవుండదు —ఇక్కడ మీకు యథేచ్ఛ, ఒకరు ఒకర్ని హింసిస్తారన్నదిలేదు. పోటీలేదు. వివాదలేదు: సరి. అన్నీ మీకే తెలుస్తయ్. నేను పోతున్నాను"

అవునవును. మీకు ఎన్నో పన్లుంటై. నాకోసం చాలా శ్రమతీసుకొన్నారు. కృతజ్ఞుణ్ణి"

ఆగంతకుడు మరోసారి మందహాసంచేసి వెళ్ళిపోయాడు. మనస్సుకు మైకంతోపాటు భయమూ

వేసెంకోటి సౌందర్యసీమలో తిరుగుతున్నాడు కాంతయ్య. అంతా కొత్త. అంతా అపురూపం. ఇంతలో కాంతయ్య వెన్నున ఓమాపు తగిలింది.

"సౌభరీ! సౌభరి!!"

ఆపిలుపులో, ఎంత ప్రశాంతమైన ఆర్తం!

"పునర్వసూ! వస్తున్నా!"

కాంతయ్య చెవులు మూసుకొన్నాడు. చెవుల్లో నినదించింది. పుష్పశయ్యలు, మధురకంఠాలు, చిత్రమైన మహోజ్వల రూపాలు — ఎలుగెత్తి నాకి కుల్ని పిలిచిన పౌరాణిక ప్రకృతులు గుర్తుకొచ్చారు.

"పునర్వసూ! ఇక్కడ—ఇక్కడ—"

సౌభరి పిలుస్తోంది.

తన నావికుల చెవులు మూసి, తనను గుంజకు కట్టేయించుకొన్నాడట యులిసిస్. అంత మహాయోధ గూడా, ఆ పౌరాణిక ప్రకృతుల గాంధర్వానికి, ఆగలేక గింజుకొన్నాడట!!

ఆ పుష్పశయ్యలు గుర్తుకొచ్చినై, కాంతయ్యకు.

—పునర్వసు వచ్చాడు.

సౌభరిని కేలగీలించాడు.

కాంతయ్య సిగ్గుపడి తల తిప్పుకొన్నాడు.

సౌభరీ పునర్వసూ అలా వెళిపోయారు.

కాంతయ్య గుండెలలో దేవినట్లు అయింది — అప్రయత్నంగా తనూ అటుగేసి కదిలాడు. నిగ్రహించుకొన్నాడు.

భుక్తరోగం అయినా, అదేకావాలని తపించే మనస్సు ఏడుస్తుంది. ఆ మారాముళ్ళు తనకు తెలుసు!

యింతలో పునర్వసూ సౌభరీ యిటే వస్తున్నారు.

"నీవు మందాకినీతీరం అంటున్నావా సౌభరీ. నేను హాహాహూహూల గాంధర్వం విందాం అనుకున్నాను. ఏదైతేనేం—"

"మందాకినీ, శివశిరస్సుపైని నడివెన్నెల— పోనీ, నీయిష్టం పునర్వసూ!"

కాంతయ్య వాళ్ళవెంట పడ్డాడు. ఆకలికాని ఆకలి, తష్ణకాని తృష్ణ. విదాహం వెంటాడుతోంది.

"జిజ్ఞాసచూపు వెంటాడుతోంది!" సౌభరి.

"కొత్తకాబోలు!"

కాంతయ్య ఆపుకోలేకపోయాడు. "సౌభరీ! సౌభరిగారూ!" సౌభరి ఆగింది. పునర్వసు ముందుకు వెళుతూనే వున్నాడు.

"సౌభరిగారూ మిమ్మల్ని చూడాలని, సౌభరీ! నీతో మాట్లాడాలని నిన్ను తృప్తిగా చూడాలని— నిన్ను—నిన్ను—"

సౌభరి పకపకా నవ్వింది. "ప్రేమించావన్న మాట!" అంది.

కాంతయ్య గిలగిలలాడాడు.

సౌభరి కనుబొమల్ని దగ్గరికిలాక్కుంది.

"నిన్ను చూస్తూంటే, నీతో మాట్లాడుతుంటే, నిన్ను సౌభరీ అని పిలుస్తూంటే — నీ పేరు నానోటి మీదుగా వస్తూంటే — — "

"నేను కావాలి అంటావు!"

కాంతయ్య తెల్లపోయాడు.

"నాకు యిష్టం లేదు. కొత్తవాడివని ఓపికగా చెప్పాను"

సౌభరి వెళ్ళింది.

గిలగిలలాడి, తోకతెగాక, నల్లికిళ్ళపాములాగ, కాంతయ్య నడకసాగించాడు మరోవైపు!!

*　　　*　　　*

కల్యాణ సింధువు మహారాజులబిడ్డ. సుకుమారి ఏదో లోకంనుంచి దిగివచ్చినవాడిలాగా వుంటాడు. అధికారం చేతిలోకి వచ్చింది. ఆత్మ వికసించింది.

పంకాకింద కూచునివున్నాడు కల్యాణం. చేత పుస్తకం.

"అబ్బ. ఏం దాహం!" అనుకున్నా రాయన.

చంపకం, చల్లనిపానీయం తెచ్చింది. కల్యాణం కన్నెత్తిచూచాడు. ఎన్నిసార్లు చూడలేదు? ప్రౌఢ శిల్పివాక్యవిన్యాసంలోని భావంలాగ మెరుస్తోంది చంపకం. తను ఇంకా పానీయం అని అనుకోనన్నా లేదే. చంపకం ఎలాగ అర్థం చేసుకుందీ? పానీయం తయారుచేసిందీ? తెచ్చిందీ. ప్రేమవుంటే అన్నీ తెలుస్తయ్.

"నుంచున్నావేం, కూచో—"

చంపకం అలాగే నుంచుంది.

"కూచో చంపకం!"

"నేను కూచోరాదుప్రభూ. ఇలా వుండడమే నాకు శోభ"

దాసీదాన్నని చంపకం హద్దులలోనే ఇమిడింది.

"ఎక్కువ తక్కువలు వృథావృథా చంపకం. కనీసం, నాదగ్గర అవి వృథా"

చంపకం ఊహాను నమిలి మింగినట్టుంది.

"ఏమిటో అనబోయి ఆగావు. మనసులో మాట చెప్పడానికేం—! చెప్పు చంపకం!"

"దగ్గిరికి తీసేప్పుడు అందరూ అనేమాటేగదా అనుకుంటున్నా పానీయం తాగండి ప్రభూ. ఎండ మండిపోతోంది."

"నువ్వుకూడా—"

"తప్పుతప్పు"

"తప్పు ఒప్పులతోటే బతుకు పండిపోతోందిలే. ఆ, రా. రా." చంపకం కొయ్యబొమ్మ.

"మర్మం విడిచి చెప్పు చంపకం! ఏంసుఖం చూచుకునీ బ్రతకడం! నువ్వు అనుకొనేది చెప్పు చంపకం!"

"ఎప్పుడో ఒకప్పుడు చచ్చిపోతాం. ఆపైన ఏ బరువూవుండదు. ఇంతకన్న మరేం సంతృప్తికావాలి ప్రభూ! చల్లనితల్లి—చావమ్మవారు. ఆ చల్లనితల్లి, ప్రశాంతమైన ముఖంతో తల్లి కూతుర్ని పుట్టింటికి తీసుకువెళ్లడానికి వచ్చినట్లు వస్తుంది. జాలిగా శిరస్సుపై చెయ్యివేస్తుంది. కళ్లనీళ్లు తుడుస్తుంది. మారాం పట్టేపిల్లలకు, తల్లి, తాయిలం పెట్టినట్లుగా, ముద్దుగా, 'రా' అని తన ఒడిలోకి తీసుకొంటుంది. చాలు. ఇంతకంటె వేరే ఏంకావాలిప్రభూ!

"అ-బ్బ!"

"అందరూ బొడ్డున మాణిక్యం పెట్టుకొని పుట్టరు. కాలంవల్ల అవసరాలు పెరుగుతై. అసలే మనుషులు కోరికలపుట్టలు ఏదీ చాలదు. ప్రతిరోజూ ఓపాము కాటు."

"జీవితాన్ని మనం మార్చుకోలేమా, చంపకం" చంపకం నవ్వింది.

ఏడ్చేవేళలో నవ్వు!

కల్యాణం కళవళ పడ్డాడు.

"చంపకం! దా. ఒక్కరికైనా సుఖం కల్పిస్తాను. చాలు"

"వద్దుప్రభూ. నేను మగనాలిని. సంరక్షించబోయిహింసించకండిప్రభూ! మీకు పుణ్యంవుంటుంది. మీకాళ్లకు మ్రొక్కుతాను.

"నిన్ను నేను పెళ్ళాడుతానుచంపకం"

"ప్రభూ. మీరు మూడవవారు, ఈమాట నాతో అన్నవారిలో. ప్రేమమిథ్య. కామం సత్యం. తవుడు తింటూ ఒయ్యారాలెందుకు గానీండి ప్రభూ — ఆ పానీయం, ఎండకు వెచ్చబడుతుందేమో"

"తే. జీవితం, ఎంతచిత్రం!"

*     *     *

కాంతయ్యకు స్వర్గం అంతా చిత్రంగా వుంది. అలుపులేదు. పిలుపులేదు. దాపరికంలేదు. అలాగే పడిపోతున్నాడు. నిత్యశ్రీ ఎదురైంది. "ఏంచేస్తున్నావేమిటి?" అంది.

ఎంత చనువు. గొంతికలో మార్దవం వుంది. తనతో ఏంపనో? అడిగాడు.

"నా పేరు నువ్వు అంటూంటే వినాలని వుంది."

సరిగ్గా యిదే అంది, మాణిక్యం, చిన్నప్పుడు! సన్నగా వుండేది. ఇది చక్కపేడు అని ఎవరో అన్నారు, మాణిక్యాన్ని. రాజపుతానా చిత్రాలలోని రేఖాసౌందర్యం, మాణిక్యం అనుకున్నాడు తను.

"అతిథీ. ఆలోచనలో పడ్డావా? నేను ఏంచేస్తున్నా, నన్నే గమనించే నిన్ను చూడాలని. నిన్ను, నీకళ్లను, నీప్రాణాలను, ఆ ప్రాణవాంఛను—"

"పాపం. కాదంటే, కారాడిపోతావు. నాకు తెలుసు ఆబాధ"

"ఇంత స్వల్పమైన విషయాలకు బాధ ఎందుకు అతిథీ. ఏమీ దాచుకోకుండా చెప్పు!"

"నేను సౌభరిని వాంఛించాను. సౌభరి తృణీకరించింది. మయసభలో మహారాజు దుర్యోధనుడిలాగా అవుతున్నా"

"వాడెవడు? ఎవడో. మందాకినీతీరానికి రారాదూ, పోదాం"

"పద వస్తాను నిత్యశ్రీ! నిత్యశ్రీ. ఇది చెప్పు. మనను, మన సున్నితమైన రహస్యవాంఛను చులకన చేస్తే, గాయంకాదూ గుండె—"

"అనుకోడంలో వుంది. ఆ వాంఛే మన సర్వస్వమూ అనుకుంటే ఆరాటంకదూ మరి!"

"ఏమిటేమిటి—?"

"ఆటలో ఓడిపోతాం. దిగులుపడతామా? కాలు జారి కిందపడితే పరాభవం అనుకొంటారా. అంతా అనుకోటంలోవుంది. మనసంగతే చూడు. నేను నీకు ఇష్టంలేకపోతే"

"అంటే, హృదయానికి గాఢత్వం లేదు అన్నమాట!" అని కాంతయ్య ఆగాడు. "నేను మీయింట

కోడళ్ళేరా!" అని బుగ్గమీద కొట్టిన మాణిక్యం, నమ్మించిన మాణిక్యం, తనను కాదని, సత్యనారాయణతో "అజంతా"కు పోయింది కులుక్కుంటూ: తను ఆనాడు ఏడ్చినదంతా చాద స్తమేనా?

నిత్యశ్రీ అందుకుంది.

"సౌభరికి ప్రేమలేదు అనుకుంటున్నావు కదూ!"

కాంతయ్య ఉలక లేదు పలక లేదు.

"సౌభరికీ ప్రేమవుంది"

ఇద్దరూ నడుస్తున్నారు.

"ఆకంఠంలో కాఠిన్యంవుంది మరి?" అన్నాడు.

"యిష్టం వుంటేనే కాఠిన్యం. నీకు నామీద లేదూ—నాకు తెలియదూ"

"భూమిమీద యిట్లా బాహాటంగా మాట్లాడు కోరు. తప్పు!"

"అందుకే అక్కడికి వాళ్లు ప్రతిదానికీ భయపడి భస్తారు చంపేస్తారు. దా. ఇదే మందాకిని. ఆ వెన్నెల కైలాసవాసి, పరమేశ్వరుని శిరశ్చంద్రిక!"

"ఏంఅదృష్టం. చీకటే అన్నమాటేలేదుమీకు"

"మనకుఅను. అదుగో, మీ సౌభరి వస్తోంది"

"అనవసరం"

సౌభరి దగ్గిరికే వచ్చేసింది. అందం, ఆనందం, కోయిల రెట్టించి కూసినట్లుగా వుంది.

"నాకు కావాలి మీమాట. ఇందాక ఏదో చెప్పబోయారు!" అంది సౌభరి.

"ఏమీలేదులెండి. నేను అనలేదు; మీరు వినలేదు!"

"మీరు అనుకున్నారుగదూ. చెప్పండి"

"చెప్పటానికి ఏమీలేదు!"

"ఇంతేగద. వెళ్ళివస్తాను!"

సౌభరి కదిలింది.

నిత్యశ్రీగూడా కదిలింది. "నేనూ వస్తాను!"

కాంతయ్య "అలాగే" అన్నాడు.

"వుండు! అనలేకపోయావు. 'నాకోసం వుండవూ' అంటే ఎంతఇదిగావుండేది. 'నాకోసం—' అని మొగాడు అర్థిస్తాంటే, ఆడదిఅనుభవించేఆనందం ...ఊఁ. వస్తున్నా"

నిత్యశ్రీ వెళ్ళిపోయింది. కాంతయ్య ఏమీ జరగనంతగా, మందాకినికేసి వెళ్ళాడు. నిర్మలమైన మందాకిని. కదలికలేని, గంగ. స్నానం చేద్దాం అనుకున్నాడు. ధనురాకారమైన గంగను కాశీలో చూచి కాంతయ్య ఎప్పుడెప్పుడు స్నానంచేద్దామా అని తహతహలాడాడు. ఇప్పుడదిలేదు. తీరా దగ్గిరికిపోయి నీళ్ళుచూచి, నిర్లిప్తుడై చక్కా వచ్చాడు. హెచ్చని తగ్గని వెన్నెలలో కాంతయ్య నడుస్తూ పోతున్నాడు!

* * *

కల్యాణసింధువుకు మెలుకువ వచ్చేసరికి జోర వెన్నెల. చీరలాగా వుంది ఆకాశం. ఎండిన గోరింటాకు చేతులు కడుక్కొని, చల్దులుతిని, ఆడపిల్లలు ఊయాల లూగుతున్నారు!

పాటలు పాడుతున్నారు.

పడుచుదనం పిలుస్తోంది.

కల్యాణ సింధువు కళ్లు పెద్దవిచేసుకొని మరీ చూచాడు.

తనలోకం తన స్వర్గం తనకు ప్రత్యక్షమైంది.

గబగబా అక్కడకు వెళ్లాడు.

అతన్నిచూసి అందరూ జడిశారు. ఉయ్యాలాలు దిగి, వొదిగి, వొదిగి, నుంచున్నారు. చల్లగా జారుతున్నారు. ఒక పిల్ల చేయిపట్టుకొన్నాడు. ఆ పిల్ల గిజగిజ లాడింది. ఇందాక నుంచీ జంకిన సైదోడులు ఫక్కున పగలబడ్డారు.

"ఏం వెళ్ళిపోతారేం?"

నిర్జీవ ప్రతిమలాగైంది ఆ పిల్ల.

"కలిమెలిసి మీతోపాటు ఉయ్యాల లూగాలని వస్తే—"

నెత్రాణ్ణి చూచినట్లు చూచారు. చేతిచిక్కిన పావురం—చేయి జార్చుకుంది. చిటికెలో అంతా శూన్యం. ఎక్కిరిస్తూ ఉయ్యాలలూ, దిగాలు పడి తానూ.

"అంద చందాలు తెలీని పాడుదేశం. ఏ కర్మో కాలితే గానీ—యిక్కడ పుట్టరు" అనుకుంటూ కల్యాణ సింధువు వెళ్ళిపోయాడు.

* * *

తన గదిముందు వరండాలో, ముఖమల్ పరుపులపైని కల్యాణం పడుకున్నాడు. పైన ఆకాశం మధురంగా వుంది. కలవ పూవులాగ చందమామ. కింద మెరుస్తూ శుక్రుడు. శుక్రలోకం బహు బాగుంటుంది. అక్కడ చెట్లు సంగీతం పాడి నృత్యం చేస్తయ్. కాలవలు కవిత్వం చెబ్తయ్. గాలి చిత్రాలు రచి

స్తుంది. ఇంత దూరానికి గూడా విప్పారి వెలుగుతూన్నది శుక్రలోకం. కింద గురువు. ఇంకా కింద ఆ ఎర్రని పిడుగు కుజుడు. గుత్తులు గుత్తులు లాగున విరిసిన నక్షత్రాలు! తనివితీరా చూస్తున్నాడు. వెళ్లాలని వెర్రిగా వుంది. ఏంచేస్తాడు? చూచి సంతోషిస్తున్నాడు.

"నిద్రపట్టలేదా ప్రభూ!"

మందారమాల. మందారమాల లిప్సామూర్తి. ప్రేమను పిండేసే ఆ కళ్లు, వెలిగిన విద్యుద్దీపంవంటి ఆ చెక్కిళ్ళు, చెక్కిట చిన్నమచ్చ, షండుల్ని పండితుల్ని చేయగల లిప్సాత్మకమైన ఆ ఆత్మ—! ఆమె పలకరిస్తే చాలు, పదిమెట్లు పైకెక్కారన్న మాటే.

"నిద్రపట్టనే లేదా ప్రభూ!"

కల్యాణ సింధువు నిట్టూర్చాడు. "బహు పరిచితాలయిన దేశాలను బహుదూరం నుంచి చూస్తున్నాను, మందారం."

"ఎప్పుడూ మీ కిదో ఘోష. ప్రాణాలన్నీ ఎక్కడో పెట్టుకునివుంటారు మర్చిపోండి ప్రభూ!"

"మరుపు లేదు నాకు. ఇదుగో, ఆ మెరుపు వంపు చూడు, అక్కడ, ఓసారి ఏంజరిగిం దనుకున్నావు!"

"మర్చిపోండి ప్రభూ. దైవం ఇచ్చిన ఒక్క వరాన్నీ కాదంటే ఎలాగ. మరపుపెట్టి, మనుష్యులను కాపాడాడు దైవం!"

"మందారం—"

తన బుజాన చెయ్యిపడుతున్న దనుకుంది మందారం. కల్యాణం నిగ్రహించుకొన్నాడు. మందారమాలే. సరసకు జరిగింది. సంపెంగ పువ్వును తీసుకొన్నట్లు, కల్యాణం చేతిని తన అరిచేతిలోకి తీసుకుంది.

"కుజుడు, ఆపైన గురువు, చూచావూ, ఆపైన శుక్రుడు, అందరికీ పైన చంద్రుడు, కలవ పువ్వులాగ." కల్యాణం ఆపుకోలేక పోయాడు.

"నేనూ మీవాణ్ణేనర్రో, నే నిక్కడున్నానర్రో—ఇక్కడ, ఇక్కడ. నన్ను తీసుకుపోండర్రో!" అరిచాడు.

గబగబా నలుగురూ చేరారు.

మందారమాల. పక్కకు నక్కి చెప్పింది. వైద్యుణ్ణి పిలిచారు. వచ్చిచూచి, మందు ఇచ్చి వెళ్ళాడు. కల్యాణ సింధువు భార్య చివరికి వచ్చి చూచింది. 'అయ్యగారు భద్రం' అని మందారమాలకు అప్పగించి ఆవిడా వెళ్ళింది.

* * *

వెళుతున్నారు వొయ్యారంగా దేవమిథునాలు. కాంతయ్యా గూడా వెళుతున్నాడు. సౌభరివచ్చి చేయిపుచ్చుకుంది.

కాంతయ్య తగ్గాడు.

సౌభరే దారితీసింది.

"నన్ను చూచి అలా గాతావేం?" కాంతయ్య, మూని.

"ప్రేమ పరీక్షిస్తున్నావా?"

"..................."

"ప్రేమ ఏమిటో తెలుసుకోవాలని ఇంకా ఏడుస్తావేం? భూలోకపు గుణం ఇంకా పోలేదన్న మాట!"

"..................."

"నీకు ప్రేమ లేదు. కామమూ లేదు. ఉన్నది ఆకలి. ఇందాక పలకరించలేదని, నీవెంట పడలేదని బిర్రబిగిశావు"

"నేను మీతో మాట్లాడలేను"

సౌభరి నవ్వింది.

"మాట్లాడను గూడాను"

"నిత్యశ్రీ గూడా నీతో ఇలా గేవుంటే—?"

"అర్థం వుంది. ముసుగులో గుద్దులాట ఎందుకు? మీరు, అదే, మీ స్త్రీలవైఖరి నాకు ఎబ్బెట్టుగా వుంది!"

"జరిగేపని చెప్పటం, ఎబ్బెట్టుగా వుంటుందా?"

"మీకు పిల్లలు లేరు అనుకుంటా, మీకు అంటే, మీ దేశంలో"

"ఏం?"

"వుంటే తెలిసేది. ఏది గోప్యమో, ఏది కాదో? మీ చందం నాకు—"

"అందం?"

"మదపిచ్చివాళ్ళు గూడా యిలా మాట్లాడరు మా భూమిమీద"

"అక్కడ ఏం బాధో మనసును బైటపడేస్తే. నీకోమాట చెప్పాలనుకుంటున్నాను.

"..............."

"నీ హృదయం మారలేదు ఇంకా, భూగత వాసనలు పోలేదు ఇంకా"

"మీ సువాసనల ఘాటు ఘోరంగా వుంది. ఇదేదో అందం అని, అనుకోడం మీ భ్రమ. వొచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. మందాకిని వుంది. మీరు స్నానం చెయ్యరు. దాహం తాగరు. ఆకలే లేదు. పంటలు పండించక్కరలేదు. వెన్నెలవుంది. హెచ్చదు, తగ్గదు. మీకు మార్పు అనేది లేదు"

"అనవసం. అసలిది తేజోలోకం. మందాకినీ తేజస్సే. వెర్రివెర్రి భ్రమలు పెట్టుకోక. నలుగురితో కలిసిపో."

"ప్రయత్నిస్తాను. ఐనా, ఎవరితోనూ కలవక పోయినా ఇక్కడ చెడు ఏం లేదుగా. ఆ శోభ, మా భూమిమీద"

"హృదయం మార్చుకో, సుఖపడతావు"

"అత్తింటి కాపురంలాగుందే"

సౌభరి వెళ్ళిపోతూ, పోతూ "శుక్రలోకంలోకి వస్తావా? అంతా కళా ప్రపంచం" అంది.

"పద, మీ మాట వినకపోతే బతకనియ్యరల్లే వుంది." అని కొంతయ్య అనుసరించాడు

*          *          *

ఉదయవేళ. పసుపు చల్లినట్లుగా వుంది. కుర్చీలో కల్యాణ సింధువు కూచుని ఉన్నాడు. దివాను, కళ్ళజోడు తుడుచుకొంటూనూ.

కొద్దిగా, దూరాన, రైతు; మాయామర్మమూ అమాయికమూ సమంగా కలిసిన ముఖంతో.

"నిజం దొరా—!"

గొంతికలో ఎంతో వేదన.

"దొంగవేషాలు!"

దివాను.

రైతు గిలగిల లాడాడు.

"ఈఏడు అసలే పండలేదు, దొరా. అసలే కాటకం. అందులోనూ గంప సంసారం. మా ప్రాణాలన్నీ—పై పంటో పై పంటో అని ఏడుస్తై, ఉన్న పంట ఊడ్చుకుపోతూంటే-కల్యాణసింధువు మనస్సు కరిగింది. చంపకం చెప్పినమాటలు గుర్తుకొచ్చినై.

దివాను అందుకున్నాడు. "చాలా పెద్ద సంసారమా ఏరా? వరసగా అరడజనుమంది పిల్లలూ, లేక లేక లేక లేక ఒక్కత్తె భార్యానా?"

రైతు నవ్వు దాచుకున్నాడు.

"ఎందుకురా అధిక ప్రసంగం? నిరుడూ ఈపాటే పాడితివి. ఈఏడూ అదే పాటా—?"

"నిజం దొరా. మడతకుడుములూ, రక్కసపళ్ళూ కాపు తప్ప, మరేముంది దొరా? మా ప్రాణాలకు??"

కల్యాణసింగువు కాల్చే ఆకలిని చంపకం చెప్పగా విన్నాడు.

"నీటి సప్లయి కాలేదా?"

అ నడిగాడు కల్యాణం.

వాణ్ణా అడుగుతారు! నేను మనవిచేస్తాగా. అన్నాడు దివాను.

"చెప్పవేం—"

కల్యాణం మళ్ళీ అడిగినా, రైతు, లేని నీళ్ళు నమిలాడు.

"నువ్వు భయపడుతున్నావు. భయం కంటె పాపిష్ఠిది మరొకటి లేదు. కనీసం, నా హయాంలో నన్నా భయపడద్దు చెప్పు—నీటి వనరు—"

"చెరువుల పడకలు తీయించలేదు దొరా. కాలవలు చాలవు. ఉన్నవాటికి మరామత్తు లేదు. జలాధారాలు సరిలేవు. నీటివనరూ లేక నరులబలిమీ లేకపోతే—ఎలా పంటలు పండేది దొరా?"

"తప్పు మాది. సరి. నీవు ఏమీ బాకీలేవు. దివాంజీ అతనికో వందరూపాయలు ఇవ్వండి. నాల్రోజులపాటు అన్నం తింటాడు!"

అన్నాడు కల్యాణం.

దివాన్ జీ కళ్ళు కణకణలాడినై.

"పోరా. నువ్వు, పో!"

రైతు చలించలేదు. దివాన్, కల్యాణంవైపు తిరిగాడు.

"ప్రభూ! మరి మేము కొలువు చాలించుకొంటున్నాము."

"ఏం?"

"మేం ఎందుకు ఇక్కడ చెప్పండి. మా మాట ఏమన్నా సాగేనా, పని జరిగేనా? దొరలు మీరూ వినరు. దొంగలు వాళ్ళా ఇక వినేది మా మాట?— ఎవరికీ ఏమీ చెప్పి పనిచేయించ లేకపోయాక మేం, ఎందుకు?? ఇప్పుడు మీరు ఏమీ బాకీ యివ్వక్కర్లేదన్నారు. యివ్వడు. రేపు అందరూ ఇవ్వరు. అందరికీ ఈమాటే పాటా, బాటాను. అందరూ ఎగేస్తే— మరి మేం ఎందుకు?"

కల్యాణం గుండె గొంతికలో కొట్లాడింది.

"పాపం వాడేం ఇచ్చుకోలేడు!"

"న్యాయశాస్త్రానికి పక్షపాతం లేదు ప్రభూ!"

"అయితే మామాలే తప్పఅన్నమాట. తగ్గాం!"

దివాను, రైతుపనిని వాయిదా వేశాడు.

రైతు బయటికి పోయాడు. గలాటా.

"ఏమిటది?"

దివాను వెళ్ళి గలాటాను ఆపించి వచ్చి చెప్పాడు:

"వాడే, ఆ రైతు, చూస్కో, దొరగారికి కుచ్చుల టోపీ వేశా. అన్నాట్ట, ఇకిలిస్తూ. మనవాళ్లు మన అన్నంతిన్న విశ్వాసాన, వాణ్ణి కాస్త జాడించి, బుద్ధిచెప్పి పంపారు."

"దివాంజీ! రహస్యం తెలిసింది. దయచూడడం తప్పఅన్న మాట"

"ఇంకా నెమ్మదిగా అంటారేమిటి ప్రభూ! మెత్తపడ్డామో, మన నడిసెత్తిన భరతనాట్యం ఆడిపోయారే!"

కల్యాణసింధువు లేచాడు:

"ఈ లోకం ప్రేమకు, ప్రేమలేదు. దయ చూపించగూడదు. సరదా సంతోషాలు లేవు. ఉత్త ఎడారి ఈ జీవితం!"

దివాన్ వినీ వినకుండా తన పనిలో నిమగ్నుడైనాడు. నిట్టూర్చి, "ఏదన్నా జల్సా ఏర్పాటు చేయిస్తే సరి!" అనుకున్నాడు!!

* * *

సౌభరి కాంతయ్యను శుక్రలోకంలోకి తీసుకొనిపోయింది. సూర్యచంద్రులు ఒకేసారి కనిపించి, ఒకేరీతిలో సమ్మిళితులై – వింతను వెదచల్లుతున్నారు. అడుగు పెట్టగానే మనస్సు తేలి తేలి ఆనందం నాట్యం చేస్తుందక్కడ.

దేవమిథునాలు వస్తున్నారు పోతున్నారు.

బ్రహ్మాండమైన నిర్మాణం. సౌభరే చెప్పింది. "రతీదేవి గుడి!"

కాంతయ్య అన్నాడు. 'పోదామా'

సౌభరి మధురంగా మందహాసం చేసింది.

పాల్కడలిలో నుంచి, నిద్రలేచిన లక్ష్మీదేవిలా వుంది గుడి.

గాలిపిల్లలు, గాంధర్వం వినిపించి, మబ్బు కన్నెలు మధుర చిత్రాలను రచించి, రోదసి రమ్యమైన కవనంచెప్పి, ఆత్మను ఆనందింపచేసే దివ్యస్థలం.

అమృతం!

కాంతయ్య త్రాగాడు. కొద్దిగా చేదుగా వున్న మధువు! లతల జ్యోతిష్మతులు. ఉద్యానాలు, ఊర్వశీ మందహాసాలు, వనాలు, నిధువనాలు!

కాంతయ్యకు మైకం కమ్మటం ప్రారంభించింది. సౌభరి బుజంమీద వాలాడు. సౌభరి రతీదేవికి నమస్కరించి, కాంతయ్యచేత నమస్కారం పెట్టించింది. అరకంట సరసాలతో, కాంతయ్య రతీదేవికి నమస్కరించాడు.

సౌభరి అతన్ని చల్లగా గుడి పార్శ్వభాగాలకు కొంపోయింది!

అక్కడ నిత్యశ్రీ పునర్వసు!

ఒకర్నొకరు కన్నులతో తాగుతూ, మౌనముద్రలో వున్నారు.

కాంతయ్య సౌభరిని వదలి నిత్యశ్రీని ఉపసర్పించాడు.

సౌభరి ఎక్కడికో వెళ్ళింది.

నిత్యశ్రీ, అతి యౌవన, అమోఘంగా కాంతయ్యను లాలించింది. కాంతయ్య నిద్రపోయాడు.

* * *

వ్యాఘ్రోరస్కులు, సాల ప్రాంశులు ఆ జానూజ్జ్వల బాహులు రెక్కలున్నవారు. చల్లని కాంతుల్ని చిమ్మేవారు వచ్చారు, నృత్యం చేస్తున్నారు. కాంతయ్య చూస్తున్నాడు. నిద్రపోతూనూవున్నాడు. ఒకే సమయంలో రెండూ, మళ్ళా అది కలా అంటే కల కాదు!

నిండైన మహానది తానం వాయించినట్లు, అఖండ నాదం సాధించిన వైణికుడు రాగాలాపన చేసినట్లు, శ్రావ్య కంఠ మేళ సామం గానం చేసినట్లు, లీలా తాండవ పండితుడు, కాలభూషణుడు దేవీ సన్నిధిని, తన శక్తిని తానే తగ్గించుకొని మధుర లాస్యం చేసినట్లు—అచ్చరలు ఆడారు, పాడారు. ఆమోద ప్రమోదాలు ప్రమాదం అంతగా ప్రవహిల్లినవి.

దేవమిధునాల, వేదమిధునాలై తామూ నృత్యం సలిపినవి.

మధువు గ్రోలినవి మైమరచినవి. సభ అయింది.

నిత్యసువాసిని, పెద్ద ముత్తైదువు, పూర్వాశి, వచ్చింది, వుంది. వెళ్ళింది.

వేదాలలో సూక్తించ బడిన స్త్రీ, బ్రాహ్మణాలలో ప్రస్తుతింపబడిన స్త్రీ, పురాణాలలో పౌగరువరులు పుక్కిలించిన స్త్రీ—కావ్యాలలో గానం చేయబడిన స్త్రీ, ఊర్వశి, వచ్చింది. వెళ్లింది.

కాంతయ్య కళ్లు రంభకోసం వెతికినై. అలిసినై.

అందరూ లేచారు.

కాంతయ్యా లేచాడు.

నిత్యశ్రీ కాంతయ్యను పలకరించింది!

"ఎట్లావుంది?"

"బావుంది"

"నీకూ నృత్యం చేయాలనిపించ లేదా?"

ఇది సౌభరిమాట.

కాంతయ్య నుదురు వెలిగింది. "ఊఁ"

"మీ భూమిమీద ఇలాంటివి ఉంటాయా?"

ఆఁ ? ?"

"ఇట్టి స్థళం—"

"ఆ. పారియాత్రం సరిగ్గా ఇలాంటిదే. పారియాత్ర పర్వతంమీద గూడా ఇంత ఇదీ వుంటుంది. అక్కడిలతలు, వేరువల్లంకులు, పత్ర, పుష్పఫలాలు అంతా ఇక్కడిలాగే. సీతాన్వేషణానికై తరలుతున్న వానరులకు సుగ్రీవుడు "కొన్ని జాగ్రత్తలుగూడా చెప్పాడు గూడాను!"

పునర్వసు ఫక్కున నవ్వాడు.

కాంతయ్య వాదానికి సిద్ధపడ్డట్టు తలఎత్తాడు.

"అయితే అన్నగారూ. మీకు మా స్వర్గం ఎలా వుందంటారు?"

"అద్ధాన్నంగా వుంది"

"పునర్వసు ఆశ్చర్యపోయాడు."

కాంతయ్య చెప్పసాగాడు.

మా భూమిమీద ఇల్లూ, ఇల్లాలూ వుంటుంది. పిల్లలుంటారు పనివుంటుంది. నేర్చుకోవలసింది, నేర్పవలసింది వుంటుంది. ఆశాప్రతీక్షలు వుంటయ్. నిద్రా కలలూ వుంటై"

"భయం?"

"వుంటుంది. కాని, అది ఆత్మను ముందుకు నడిపిస్తుంది. భయాన్ని నిర్మూలించడం, కనీసం అందుకని ప్రయత్నించడం వుంది. పుట్టడం, పెరగడం, వుంటుంది. ఇక్కడ అలాగా కాదే. అగ్నిలాగా అంతా యవ్వనమే"

పునర్వసు, సౌభరి, నిత్యశ్రీ నవ్వారు.

కాంతయ్య ఆగలేదు. 'నేను' ఇది చేస్తున్నాను. అనేది ప్రతిచోటా వుందక్కడ. ఇక్కడ 'నేను' అనేదే కనిపించడం లేదు. నేను అనేదే లేకపోయాక ఏముందీ, నా బొంద?"

"అమృతం?"

"మా సాధనా మార్గంలో, ఎవరికి వారికి, తలలోంచి అమృతం స్రవిస్తుంది. ఆ తైత్తిరీయక రసం అనుభూతం గూడాను. ఆ అమృతంముందు మరి మీ మధువు—"

కాంతయ్య చప్పరించి పారేశాడు.

నిత్యశ్రీ నిర్వెరపోయింది.

"నీతో వచ్చిన చిక్కు ఒక్కటే, నీ హృదయం ఏమీ మారలేదు." అంది సౌభరి.

కాంతయ్య మాట్లాడలేదు.

*   *   *

కల్యాణ సింధువు మనస్సు తాజాకావడం కోసం, దివాంజీ వారు తీర్థయాత్రలు చేయించారు. ఇండియా అంతా తిరిగివచ్చాడు కల్యాణం. యాత్రలో అనేక విశేషాలను తెలుసుకొన్నాడు. కల్యాణానికి దేశం బాగుంది. ప్రజలు నచ్చలేదు. శిల్పం బాగుంది. శిల్పులు తుమ్మాయి జగ్గాయిగా కనిపించారు. యోగులు కనిపించారు. ఆడంబరంగా, రాజకీయ యోగులూ కనిపించారు. అహంకార తాండవం చూచాడక్కడ. వెన్నెల చీకటి, వాటి హానివృద్ధులు, ఎండా వానా వాటి పోకులు, నదీనదాలు నగాలు, వాటి జీవ గాంభీర్యం. గాంధర్వం ఆ గాంధర్వంలో వినోదం కంటె వికాసానికైన గుంజాటన అన్నీ తిరిగి తెలుసుకున్నాడు.

కల్యాణంగారు ఊరికి తిరిగివచ్చిన సందర్భంలో విందులూ జల్సాలూ.

వెల్లాట కత్తెలు వక్కసమయ్యేట్టు నృత్యం చేశారు.

"రంభ?"

కల్యాణ సింధువు ఏదో అనబోతున్నాడు.

"రైలుస్టేష నేనా?" అని అందుకున్నాడు విదూషకుడు.

కల్యాణసింధువు నవ్వాడు గాని, ఆ నవ్వులో చిరాకును మించి కోపం ఉంది.

విదూషకుడు, రంభసంగతి మాకేం తెలుస్తుంది కానీండీ, రవీంద్రులు ఊర్వశిని గురించి వ్రాశారూ ......?" అని లొట్టలు వేశాడు.

జల్సాలు వాటిదారిన ఎలాపోతున్నా, ఊర్వశిని గురించి కల్యాణం గుర్తున్నంత దాకా విదూషకుడికి చెప్పాడు.

విదూషకుడు, తన 'ఊరి ఊర్వశి'ని తలచుకొని గ్రుక్కిళ్ళు మింగుతూ, దోరమాటలకు తల ఎగరేశాడు.

జల్సాలు ఐనై.

ఆనాడు, కల్యాణసింధువు భార్యతో కొంత కాలం గడిపాడు.

ఆమెగూడా అతన్ని అతని వివాహాన్నీ ఏమీ ఎరగనట్టుగా, నమ్రతగా నటించారు.

తన డ్రాయింగురూములో, ప్రపంచ శిల్పాలు అనుభవించి మరీ ఆకలిని పెంచుకొని, తనివితీరా చిత్రించిన చిత్రాలు చూచిచూచి మైమరచాడు.

కల్యాణానికి సుస్తీ.

ఫలానాఅని తేలలేదు. వైద్యులు వస్తారు, పోతారు. దివాన్జీ ఆకాశానికీ నేలకూ తాళం వేసేస్తున్నట్లు వుంటాడు.

తను ఏమీ చెయ్యడు. చెయ్యలేడు. మనస్సు, మాట మార్దవాన్ని అతిగా పెంచింది. అందువల్ల ఏచంపకానికోతప్ప అతను అయోమయం.

"నే నేం చెయ్యాలీ?" అన్న స్వంత ప్రశ్న. 'నేనిక్కడ అనవసరం' అన్నంతదాకా తెచ్చింది కల్యాణాన్ని అగాధమైన రహస్యాన్ని, ఎవరికివారు అనుభవించే ఈ ప్రపంచంలో తను ఎందుకు, అనవసరం, ఇదీ క్షోభ.

* * *

"నిత్యశ్రీ! మాట!"

కాంతియ్య సరసకు నిత్యశ్రీ వచ్చింది.

"ఒకసందేహం!"

"రహస్యం కాదుగద" అని సౌభరి అందుకుంది.

"మీకు రహస్యాలు లేవుగా" అని కాంతయ్య అన్నాడు. సౌభరి నవ్వింది.

"నిత్యశ్రీ! వగ, ఓర్పు, వెరపు, అబ్బురం, వెగటు, నగవు. మగటిమి, హొయలు, అలుక, ఈభావాలు, రసాలు ఏమీ లేకుండా యెల్లా యిక్కడ కాలం వెళ్ళబుచ్చడం?"

"కాలం అంటూవుంటేగద!" సౌభరి!

"ఉఁహు, నిన్ను అడిగి తెలుసుకోవా లనుకుంటున్నానూ..."

"ఈ తెలుసుకోవడం అనేదే అసలు ఒతప్పు. తెలిసేది తెలుస్తుంది. నువ్వు వొచ్చినప్పటినుంచీ చూస్తున్నా, ప్రతిదీ తెలుసుకోవాలనుకుంటావు!" అంది సౌభరి.

"అవునవును జిజ్ఞాసే లేకపోతే జీవితం వృథా! సౌభరిచెప్పినా, నాకా జిజ్ఞాస పోవడంలేదు. పైగా పెరుగుతూంది. నే నిక్కడ ఏం చెయ్యాలి? ఏం నేర్చుకోవాలి?"

అందరూ నవ్వారు.

"ఇది క్రీడాలోకం. విశ్రాంతి క్షేత్రం. అంతే!"

పునర్వసు అందుకున్నాడు "అతిథీ! పాపం, నీ స్వర్గతి అయిపోతున్నట్లుంది. నే నేం చెయ్యాలీ అన్న వూహ ఊరికే వస్తుందా మరి?"

"అమ్మయ్య, చెర విరగడ అవుతోందన్న మాట. బ్రతికిపోతాను. "నేను" అనేది గాఢంగా లేని చోట. ఏపనీ చెయ్యనక్కరలేనిచోట, పడివుండడం. ఘోరం. పోతా."

నిత్యశ్రీ, సౌభరీ స్తబ్ధులు.

పురస్వసువు కాంతయ్యను కావిలించుకొన్నాడు. ముద్దులు పెట్టుకొన్నాడు. తనబిడ్డ అత్తారింటికిపోతూంటే కన్నతల్లి వున్నట్లుగా ఉన్నాడు.

* * *

తేజో మేఘాలు దివ్యచకోరంగా వున్నై. కాంతయ్య భూమిమీదికి అవతరిస్తున్నాడు. కల్యాణసింధువు పైకి ఆరోహిస్తున్నాడు.

ఆహాహా, అదుగో భూసుగంధం. ఏం ఘుమఘుమ. పొగలోంచి నిప్పు వచ్చినట్లు, బెట్టులోంచి జీవంకళ!

"ఎవరునాయనా, చుక్క తెగిపడి పోతున్నట్లు పోతూగూడా — భూమోభూమో అని అఘోరిస్తున్నావు!"

"నిజం. మీరేం స్వర్గంకోసం కాదుగద?"

"ఏం? స్వర్గానికే!"

"తిరగడం దివ్యం. మార్పులేని మజాలేని, విశ్రాంతి గృహం ఆ స్వర్గం! నేను అనేది సమృద్ధిగా వుండి ఏదో సాధించడానికి వీలైనస్థలం వొదులుతావు, ఎంత పిచ్చాడివయ్యా నాయనా!"

కల్యాణం నివ్వెరపోయాడు. కాంతయ్య కల్యాణం చేయి పుచ్చుకొన్నాడు: "కావలసినంత అహంవుంది నిజమేగానీ—ప్రతిదీ ప్రతిదానికీ అడ్డంకే నే—?"

"కనక నే అహం వినియోగపడుతుంది. అడ్డంకులు తొలగించి దివ్యం చేసుకోడం మన ప్రజ్ఞ. పద పోదాం. సాధిద్దాం"

"భూమే దివ్యం అంటావు."

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ!"

"పద పోదాం!"

ఇద్దరూ, భూమిమీదికే! అవతరించారు!